# కాఫీగ్రాడ్యుయేటు పెట్టిన తొలి తద్దినం

రచయిత :

భావరాజు నరసింహారావు

అసలు యీతద్దినాలు పెట్టడమన్నా, పెట్టేవాళ్ళన్నా నాకు అదోవిధంగా ఉంటుంది. తద్దినం పెట్టామంటే మనపితృదేవతలు యీభోక్తలద్వారా—హోటల్ నుంచి 'టిఫిన్ కారియర్'తో తెప్పించుకు తిన్నట్టు--తృప్తిపడుతున్నారని వాళ్ళనమ్మకం. వాళ్ళపేరు చెప్పుకుని మనం సుష్టుగా పండులాగు తినడానికి తద్దినంపెట్టడమా? పదిమంది బ్రాహ్మలకు అన్నదానంచెయ్యడం మంచిదంటారా? కావచ్చుకాని పదివేలు వడ్డీకి తిప్పుతున్న బ్రాహ్మలకు పంచభక్ష్య పరమాన్నాలతో పదిమందికి భోజనంపెట్టేకన్నా అడబ్బులో నిరుపేదలకు నూరుమందికి కడుపునిండాఅన్నము పెట్టవచ్చునే! ఇల్లా వితండవాదంచేస్తానని, మావాళ్ళంతా నన్ను ఏబ్రహ్మసమాజంవాడో, కిరస్తానివాడో అయిపోతాడని అనుకుంటూంటారు.

ఇలాటి పరిస్థితుల్లో నేనే తద్దినంపెట్టవల్సొచ్చింది- నేను పట్నంలో చదువుకుంటూండగానే మాఅమ్మ చనిపోయింది. నాచదువు పూర్తయి యిల్లు చేరేవరకు మానాన్నగారే చేస్తూండేవారు ఆకర్మకాండ అంతా. ఈసారి తద్దినం నేనుపెత్తేనేగాని వీల్లేదన్నారు పెద్దలు—ముఖ్యంగా మానాన్న. మూఖిస్తే మరియాదగా ఉండదని అంగీకరించాను.

మొహంకడుక్కోగానే 'అధునికామృతధారలు' (కాఫీ) పుచ్చుకుంటేనేగాని ఆత్మారాముడి ఆరాటం కుదుటపడదు. తద్దినం రేపనగాను, తద్దినంనాడు కూడా రాత్రిల్లు భోజనం చెయ్యనివ్వరు సరికదా, పడుకునేటప్పుడు ఒక్కకప్పు 'ఓవల్టిన్న'న్నా పుచ్చుకోవడానికి ఒప్పుకోరుట పితృదేవతలు. ముందు మన ఆత్మారాముడు—అంటే యీ భౌతికశారీరం—స్వస్థతగా ఉంటేనే కాదండీ మనం నాలుగుకాలాలపాటు బట్టకట్టి, పది తద్దినాలు పెట్టడం!

మాటవరసకు చెప్తున్నా. ఓమాటు మాఅత్తవారింటికి వెళ్లాను. (అసలు 'పీబెర్రీ'పొడుంలేకుండా పొలిమేర దాటను—యింతకూ గ్రహచారం కొంది ...) వాళ్ళింటో కాఫీతాగే—కాదు పుచ్చుకునే—'మోడరన్ జెంటిల్మనే'లేదు. పైగా ఆప్రాంతాల్లో కాఫీదొరకదు. (అంటే యీసంగతి కొన్నిసంవత్సరాలనాటిది—యిప్పుడు అయ్యరుహోటలులేని ఊళ్లే లేవుగా ఆంధ్రదేశంలో!) పోనీ వెంటనే తిరిగివచ్చేద్దామంటే పెద్దది అత్తగారు చిన్నబుచ్చుకుంటుంది. అసలు కారణం...మీతో అబద్ధమెందుకు? చేసిన పాపం చెప్తేపోతుందని—(చెప్పినాపోదంటేమాత్రం చిక్కువస్తుంది)-మావాణిని అంతత్వరలో విడిచి రాలేకపోయాను. మధ్యాన్నందాకా అల్లాగే నాదుగా ఉండి మళ్ళీ మూడుగంటల కాఫీవేళయ్యేసరికి...ఏమైందనుకున్నారూ?...భీకర భూకంపంలాటిదేదో శరీరంలోపుట్టి నోటమాటలేకుండా కొయ్యబారిపోయాను. ఆరోగానికి కాఫీయేగాని యింకేయింజక్షన్లుగాని, ఉమాపతి (హోమియోపతిక్) మాత్రలుగాని పనిచెయ్యవు. ఏదోచేసి నన్ను మళ్ళీ మీకు, మావాణికి ఒప్పచెప్పిన మాఅత్తగారికి మిక్కిలి కృతజ్ఞులం. అవకాశంచూసుకుని ఆవిడ లక్షవత్తుల నోము సందర్భంలోనన్నా ఆవిడ షష్ఠిపూర్తి మహోత్సవం జరిపితే ఋణవిముక్తి కలుగుతుంది.

అసలు యీ దిక్కుమాలిన కాఫీ అవిక్టోరియా హాస్టల్లో అలవాటైంది. అంతకుముందు శుభ్రంగా చద్దన్నం తిన్నరోజుల్లో యింతకంటె వెయ్యిరెట్లు ఆరోగ్యంగా ఉండేది. ఇంతకూ మగవాణ్ణయి పుట్టడంలో ఆవిడ తద్దినంకాదుగాని నాతద్దినమయ్యేలాగుంది.

ఎల్లాగూ తప్పదని నిశ్చయించి బ్రాహ్మల్ని యెని మిదిగంటలకే రమ్మని గట్టిగా చెప్పాము. (మరి అలా అంటే నేగాని యేపదకొండుగంటలకోగాని రారుగా!) పదిగంటలకల్లా ఎలాగో వంటపూర్తిచేసి 'వంట ఆలస్యంలేదం'ది మావాణి. ఏంలాభం? అనుకున్నంత పనీ జరిగింది! బ్రాహ్మలు విప్పలేరు. అయ్యరు దేవాలయంలో.........ఏదన్నా......కక్కుర్తి పడ్డారేమో! బైటికివెళ్తే నేనుకూడా అంతపనీ చేస్తావని మానాన్నగారు నాకు కాపలా.

గడియారంచూస్తూ యీరోంగముండావాళ్లు యింకారాలేదు కొత్తవాళ్ళని మాట్లాడితే మంచిదంటూండగా బ్రాహ్మలొచ్చారు పన్నెండింటికి. వాళ్ళని పక్షాచేసి సాంబారుచేసేటంత హంగామాచేసి గబగబా స్నానంచేసి తడిపొడి బట్టలతోనే (ఎండాకాలంలోనన్నా పోయిందికాదు మాఅమ్మ) ఉపక్రమించాం.

ఎరుగున్నారుగా బస్తీబ్రాహ్మల మంత్రాలవేగం! 'ఓం కేశవాయిస్వాహా' దగ్గరనుంచి ఒక్క పొడుం పిసరుతో 'హరేశ్రీకృష్ణాయనమః' దగ్గరకు ఒక్కచే కప్పగంతు. అలాగే అరగంటలో మెల్బోర్న్ ఎయిర్ రేస్‌స్పీడ్‌తో భోక్తాభోజనఘట్టందగ్గర కాసేపు ఆగి బొగ్గువేసుకుని, పిండప్రదానస్టేషను చేరాం. ఇంతవరకూ 'మధు' అనుకోవటం, 'జంధ్యం' తిప్పటం మినహాగా మిగతా పనంతా బ్రాహ్మడే చేశాడు.

దొడ్లోనుంచుని మళ్ళీ ఒక్కపొడుంపట్టులాగి పిలకదులుపుకుంటూ "ఆఁ! మీనాన్నగారి పేరేమిటండీ మర్చిపోయాను" అన్నాడు బ్రాహ్మడు. దేనికోసనుకుని 'రామారావుగారు'ని చెప్పాను. 'సరే! సరే! మొదటపిండం పుచ్చుకోండ'న్నాడు. బ్రతుకు జీవుడా ఏమోననుకున్నా బ్రాహ్మడు బహుమంచివాడనుకుంటూ మొదలుపెట్టాను భోజనం. ఇంతలో ఏదో మంత్రంపూర్తిచేసి 'రెండోది పుచ్చుకోండ'న్నాడు. "ఊఁ" అన్నాను. మళ్ళీ యింకోమంత్రం పూర్తిచేసి 'మూడోది' అన్నాడు. నాకు చెడ్డకోపం వచ్చి "మొదటిదంటే ఆకలిమీద తొందరగా వెళ్ళింది గాని యింతపెద్దముద్ద అంతతొందరగా ఎల్లా తింటాననుకున్నారయ్యా?" అన్నాను. నాకేకలువిని మానాన్నవచ్చారు పావిట్లోంచి. ఇదంతా వంటింట్లోంచి చూచి గాఁవల్లు వాణి విరగబడినవ్వుతోంది.

పాపం బ్రాహ్మడు తెల్లబోయి 'అయ్యా! మీ అల్లుడుగారికి అనుభవంలేనట్లే ఉందే? నేను యథాశాస్త్రీయంగా 'యజమానస్యపితుః......' అని మంత్రంచెప్తూంటే...వాటిని భోంచేస్తున్నారు చూశారా!' అని నామీద నేరారోపణచేశాడు.

ఇంతకూ నేచేసిన నేరమేమిటట—'తద్దినాలకి పిండాలు రసీదులంట. నేనారసీదుల్నే......'

'అల్లుడుకాదు నీపిండాకూడూ కాదు. బతికున్నవాడికి నాకేతద్దినంపెట్టిస్తూ, వాడితప్పులు దిద్దుతున్నావా? అప్రాచ్యకప్పు......' అని నాలుగు...లో బ్రాహ్మడికి స్వస్తిచెప్పి, 'ఎన్నిచదివినా ప్రపంచజ్ఞానంలేని—పశువు'నని నాకక్షింతలువేసి యథావిధిగా మర్నాడు తద్దినంపెట్టించారు దగ్గిరుండి.

అంతే, మళ్లా మాయింట్లో ఏశుభాశుభాలు వచ్చినా ఆబ్రాహ్మడు రాకపోగా ఆయన ఎరుకలో ఉన్నవాళ్ళను కూడా మాగడపతొక్కనివ్వలేదు.

నిజానికి మానాన్నగారు అగ్గిరాముడు కాకపోతే-మాకాలేజీలో తద్దినాలగోలేమీ చెప్పందే నాకెలా తెలుస్తుంది చెప్పండి? మన ఆంధ్రాయూనివర్సిటీవారన్నా యీ తద్దినాల ప్రాక్టికల్ కోర్సును పెట్టకపోవడం చాలా శోచనీయమైన విషయం. పోనీ నేనుమాత్రం తెలివితక్కువవుంటనా! ఏదో రెండు అక్షరాలు సంపాయించుకున్నానా? అయినా యిదే మొదటిదికాబట్టి...అటువంటివాణ్ణి పన్ను పట్టుకుని—అందులో వాణి ఎదట—పోనీ యేహిందీలోనన్నా యింగ్లీషులోనన్నా కాకుండా, 'ప్రపంచజ్ఞానంలేని......' అంటే, నాకు, పైకేమీ అనలేకపోయినా, గర్రగా ఉండదూ? ఇదే ఏ బెంగాలీవాడో ఐతే ఊరుకుంటాడూ? అనకూడదుగాని, ...య్యేది, శాతయ్యేది—.